క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టుకు కంకల్ విద్యార్థి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పూడూరు: విద్యార్థులు చిన్నప్పటి నుంచే పట్టుదలతో చదివి పోటీతత్వాన్ని అలవర్చుకుంటే అన్నిరంగాల్లో రాణిస్తారని మండల విద్యాధికారి సాయిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పరిగిలో జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. మండల పరిధిలోని ఇంగ్లీషు మీడియంలో కంకల్ పాఠశాల విద్యార్థి ఎం. ప్రకాశ్, మండల స్థాయి, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచాడు. అనంతరం శనివారం పరిగిలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో ప్రతిభచూపి రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ మేరకు కంకల్ పాఠశాల హెచ్ఎం పుష్ప, ఉపాధ్యాయులు చంద్రమోహన్, మల్లేశ్వరి, తదితరులు అభినందించారు.

పాఠశాలకు సౌండ్ బాక్స్ అందజేత



మల్లికార్జున్‌రెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల విద్యాకమిటీ

ధారూరు: మోమిన్‌ఖుర్దు ప్రాథమిక పాఠశాలకు శనివారం మల్లికార్జున్‌రెడ్డి రూ.12వేలు విలువ చేసే సౌండ్ బాక్స్‌ను హెచ్ఎం నర్సింహులుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ పాఠశాలలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకరావచ్చని, సాధ్యమైనంతవరకు పాఠశాలకు సాయం చేస్తానన్నారు. అనంతరం పాఠశాల విద్యాకమిటీ, ఉపాధ్యాయులు దాతకు శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరప్ప, గ్రామ పెద్దలు రవీందర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ఎంపీడీఓ మహేశ్‌బాబు



బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: నర్సరీ నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు. శనివారం దోమ మండల పరిధిలోని గొడుగోనిపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. తదనంతరం నర్సరీని సందర్శించి బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో నర్సరీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వివిధ రకాల మొక్కలను ఏర్పాటు చేసి అవసరమైన వాటిని రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరమని కాంగ్రెస్ నేతలు అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన బంటు అనంతయ్య కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. ఈ సందర్భంగా రూ.12,500 మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నర్సింహారెడ్డి, చంద్రశేఖర్, రాము, బషీర్, ఇంతియాజ్‌ఖాన్, రమేశ్, భీమయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏర్పాటు

బొంరాస్‌పేట: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఆదివారం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్‌మాదిగ తెలిపారు. 11గంటలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల మాదిగ విద్యావంతులు, గ్రామ కమిటీల నాయకులు హాజరుకావాలని తెలిపారు.

నాట్లు షురూ!



దుద్యాల్ సమీపంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

- సరైన సమయంలో వేస్తేనే దిగుబడి
- ముందస్తుగా మేలే
- జోరుగా బోర్లకింద సాగు
- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

దుద్యాల్: ప్రస్తుతం యాసంగి పంటకాలం ప్రారంభమైంది. దీనికోసం రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. తమతమ నాట్లను సరైన సమయంలో వేసుకుంటున్నారు. ఆలస్యమైన వారు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వ్యవసాయపనులు నిర్వహిస్తున్నారు. దుద్యాల్ మండలంలో ప్రస్తుతం 20 నుంచి 30 శాతం వరకు నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బోర్ల కింద వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. మునుముందు ఎండల తీవ్రత పెరిగితే బోర్లలో నీరు తగ్గే అవకాశం ఉంది. దీంతో పంటలకు నీరందక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో కొందరు రైతులు ముందస్తుగా సాగుకు సిద్ధమయ్యారు. చెరువు నుంచి ఏటి కాల్వల ద్వారా వచ్చే నీటికి సాగు చేసే పొలాలు మాత్రం ఆలస్యమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. బోర్ల కింద వరి నాట్లు ఊపందుకోవడంతో అందుకు తగ్గట్టుగా రైతులు పొలం పనుల్లో నిమజ్ఞమయ్యారు. ఇప్పటికే నారు మడులు పూర్తయ్యాయి. దీంతో పొలాన్ని దమ్ము చేయడం వంటి పనులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో మండలంలో వరి పంటను 10 నుంచి 12వేల ఎకరాల్లో సాగుచేశారు. యాసంగిలో మాత్రం 9 నుంచి 10వేల వరకు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి తులసి చెబుతున్నారు. బోర్లలో నీరు రోజురోజుకు తగ్గుతుందనే వాదన రైతుల్లో బలంగా వినిపిస్తున్న మాట. ఇప్పటి వరకు మండలంలో దాదాపుగా 1500 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని అధికారులు అంచన వేస్తున్నారు.

> **సకాలంలో వేసుకోవాలి**
>
> 
>
> రైతులు యాసంగీలో పంటలు సకాలంలో వేసుకుంటే మంచి దిగుబడి సాధించొచ్చు. సాగు ఆలస్యమైతే ఎండలు ముదురుతున్న కొద్ది బోర్లల్లో నీరు తగ్గిపోయే అవకాశం ఉంటుంది. దీంతో పంటలకు నీరందక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చెరువుల కింద సాగు చేసే రైతులు తొందరగా నాట్లు వేసుకుంటే మంచిది. లేదంటే కోత దశలో ఇబ్బందులు తప్పవు. ముందస్తు నాట్లు వేసుకుంటే రైతులకు మేలు కలుగుతుంది.
>
> – తులసి, వ్యవసాయ అధికారి

అందరినీ పర్మినెంట్ చేయాలి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏఐటీయూసీ మహాసభలో జిల్లా కార్యదర్శి గోపాల్

తాండూరు టౌన్: తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం గోపాల్ పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్లో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ మున్సిపల్‌లోని పలు విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కలిపించాలన్నారు. వారందరిని పర్మినెంట్ చేసేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, జాతీయ సెలవులు ఇవ్వాలని, ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయాలని, వేతనాలు ట్రెజరీ నుంచి విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షురాలు విజయలక్ష్మిపండిట్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా మున్సిపల్ సంఘం నూతన కౌన్సిల్ సమితిని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి అశోక్, ఎం గోపాల్, అధ్యక్షుడిగా పి నర్సిములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోటం రాజు, ఉపాధ్యక్షుడిగా వెంకటప్ప, వీరమణి, ప్రధాన కార్యదర్శిగా లాలప్ప, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఏ శ్రీనివాస్, కార్యదర్శులుగా జె గోపాల్, నరసింహ, కోశాధికారిగా విజయలక్ష్మి, సభ్యులుగా ప్రకాశ్, వెంకటయ్య, దేవి, గోరమ్మ, భువనేశ్, అరుణమ్మ తదితరులను ఎన్నుకున్నారు.

కాలయాపన చేయడం బాధాకరం

సర్పంచుల సంఘం మాజీ నేతల వినతి



ఎమ్మెల్సీ కవితను కలిసిన రాష్ట్ర సర్పంచుల సంఘం నేతలు

దోమ: సర్పంచుల బిల్లులను ప్రభుత్వం చెల్లించకుండా కాలయాపన చేయడం బాధాకరమని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ నేతలు రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, యాదగిరి, ప్రణీత్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో పలువురు మాజీ సర్పంచులతో కలిసి జిల్లా సర్పంచుల సంఘం నేత రాజిరెడ్డి ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లుల విషయాన్ని ఆమె దృష్టికి తెచ్చారు. గత బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో తాము సర్పంచులుగా ఉన్న సమయంలో ఉపాధి హామీలో చేపట్టిన భవన నిర్మాణాలు, పాఠశాలల ప్రహరీలు, క్రీడా మైదానాలతో పాటు వివిధ పనులను తాము అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఆ బిల్లులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించడం లేదని వాపోయారు. చేసిన పనులకు సంబంధించిన చెక్కులు జనరేట్ అయినప్పటికి అవి ట్రెజరీల్లోనే పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల కేంద్రంలో సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వ హిస్తున్నట్లు ఎల్ఎస్ఆర్ యువసేన వ్యవస్థాపకుడు లొంక నర్సిములు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ బీట్ల పరిశీలన

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్లో శనివారం నిర్వహించిన బీట్లను ఏఎంసీ కార్యదర్శి సిద్ధమ్మతో చైర్మెన్ విజయభాస్కర్ రెడ్డి పరిశీలించారు. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన కందులు, వడ్లకు తగిన మద్దతు ధర లభిస్తుందా? లేదా? అని కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. చైర్మెన్, కార్యదర్శి సమక్షంలో వ్యాపారులు బీట్లు నిర్వహించగా కందులు క్వింటాల్‌కు రూ.7,650, మధ్యస్తంగా రూ.7,900, అధికంగా రూ. 8,040 ధర పలికింది. వరిలో 1010 రకం వడ్లు, సోనా రకం వడ్ల బీట్లను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పూజ



పూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

దుద్యాల్: మండలంలోని కుదురుమల్ల గ్రామంలో అయ్యప్ప స్వామి పూజ శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సున్నపు శ్రీనివాస్ కన్నె స్వామి ఇంట్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, అష్టోతరం, లింగాష్టకం, బిల్వాష్టకం వంటి మంత్రాలను పఠించారు. గురు స్వాములు దశరథ్, రాములు, లాలప్పల ఆధ్వర్యంలో పూజ నిర్వహించారు.

ఆర్థిక సాయం అందజేత

దుద్యాల్: మండలంలోని హకీంపేట్ గ్రామంలో మంగలి హేమలత కందుల నూర్పిడి యంత్రంలో చిక్కుకుని మృతి చెందింది. శనివారం జనార్దన్ స్నేహితుల బృందం రూ. 21,500లు కాంగ్రెస్ నాయకుడు నరేందర్ రెడ్డి రూ. 10 వేలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆమె మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

95శాతం ఇళ్ల సర్వే పూర్తి

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఎవరైనా మిగిలి ఉంటే మీమీ గ్రామాల్లోని అధికారుల వద్ద త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ సంధ్య పేర్కొన్నారు. శనివారం ఆయా గ్రామ పంచాయతీలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించామన్నారు. మండలంలో 14,876 మంది దరఖాస్తులు చేసుకోగా అందులో 14 వేలకుపైగా దరఖాస్తుల వివరాలను తీసుకున్నామన్నారు. మండలంలో 95 శాతం సర్వే పూర్తయిందన్నారు. ఇంకా వివరాలు అందించినవారు ఎవరైనా ఉంటే త్వరగా సంబంధిత అధికారులను సంప్రదించి పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా ఆన్‌లైన్ నమోదులో ఉండాలని ఆమె పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనే మట్టిలో మాణిక్యాలు



చందును సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఖోఖోలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ఘన సన్మానం

యాలాల: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తే మట్టిలో మాణిక్యాలుగా తయారవుతారని గౌతమి పాఠశాల కరస్పాండెంట్ మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్స్‌లో భాగంగా జాతీయ స్థాయి పాఠశాలల క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున ఖోఖో అండర్-17 పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గౌతమి పాఠశాల విద్యార్థి చందు యాదవ్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. తమ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయిలో పాల్గొనడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం క్రీడాకారులకు మరింత ప్రొత్సాహం అందివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొండారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలని వినతి



ఏఎన్ఎం సంఘాల ప్రతినిధులతో శ్రీనివాస్ నాయక్

కుల్కచర్ల: 11నెలలు గడుస్తున్నా వేతనాలు అందక గిరిజన ఆశ్రమ పాఠశాలలోని ఏఎన్ఎంలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎం సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంలు జీతాలు అందక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. వారికి కుటుంబం గడవక ఆందోళన చెందుతున్నారన్నారు. ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని చెబుతున్నారు. వెంటనే ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా జిల్లాల ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవరాజ్



విచారణ చేపడుతున్న జీవరాజ్

పరిగి: సాధన ఆస్పత్రిలో మహిళా మృతిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవరాజ్ అన్నారు. శుక్రవారం వైద్యుల నిర్లక్ష్యంతో మహిళా మృతి చెందడంతో శనివారం జిల్లా వైద్యాధికారులు ఆస్పత్రిని సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జీవరాజ్ మాట్లాడుతూ మృతురాలు ఎలా మృతి చెందింది? పూర్తి వివరాలు తెలుసుకుని, కుటుంబ సభ్యుల స్టేట్ మెంట్‌ను తీసుకొని ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఆస్పత్రిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహించినా, అర్హతకు మించి చికిత్స చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

సాధన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మహిళా మృతికి కారకులైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, మల్లేశ్ డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పరిగి పట్టణంలో రోజు రోజుకు వైద్యుల తీరు దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిరాని వైద్యం అందిస్తు పేదలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, నాయకులు నర్సింహులు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు సర్వసాధారణం



ఎంఈఓ హరిశ్చందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

పూడూరు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని పీఏసీఎస్ చైర్మెన్ పట్లోళ్ల సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పూడూరు మండల కేంద్రంలో ఎంఈఓగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న హరిశ్చందర్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైందన్నారు. దాన్ని సక్రమంగా నిర్వహించి పభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా నడుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక నిధులు వెచ్చిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ హరిశ్చందర్‌ను మండల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పాండు, మాజీ ఎంపీపీ మల్లేశం, మండల విద్యాధికారి సాయిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, డీసీసీ కార్యదర్శి శకీల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంకు ఏర్పాటు చేయాలని వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల ఎంపీని కోరిన ధారూరు పీఏసీఎస్ చైర్మన్

ధారూరు: ధారూరు మండల పరిధిలోని నాగారం గ్రామంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయించాలని పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి శనివారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కోరారు. ఎంపీ నాగారం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ 4జీ సెల్ టవర్ శంకుస్థాపనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి మాట్లాడారు. పెట్రోల్ పంపు విషయం గురించి ప్రస్తావన తెచ్చారు. నాగారం సమీపంగా 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, దాదాపు 20వేల జనాభా ఉంటుందని, ప్రతి కుటుంబానికి ఏదో ఒక వాహనం ఉందని ఆయన ఎంపీతో దృష్టికి తెచ్చారు. 15 కిలోమీటర్ల వరకు ఇక్కడ పెట్రోల్ పంపు అందుబాటులో లేదని, దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ధారూరు పీఏసీఎస్‌కు పెట్రోల్ బంకు కెటాయిస్తే నాగారంలో అందరికి అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయిస్తామన్నారు.

సాంఘిక శాస్త్రంలో పట్టు సాధించాలి



గెలుపొందిన విద్యార్థులతో ఎంఈఓ గోపాల్ తదితరులు

మండల విద్యాధికారి గోపాల్

పరిగి: విద్యార్థులు చిన్నతనం నుంచే సాంఘిక శాస్త్రంలో పట్టు సాధించాలని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని జిల్లాపరిషత్ నంబర్‌వన్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర జిల్లా స్థాయి ప్రతిభ పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లీష్ విభాగంలో మొదటిస్థానంలో కార్తిక్‌యాదవ్ జెడ్పీహెచ్ఎస్ ముజాహిద్‌పూర్, ద్వితీయస్థానంలో వైష్ణవి దాదాపూర్ ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో శ్రీహర్ష, నందిని, ప్రకాశ్, తెలుగు మీడియంలో ప్రథమ స్థానంలో రాధిక తట్టెపల్లి ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో రోజ గుండాల్ ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో ఐశ్వర్య, అన్నపూర్ణలకు బహుమతులు అందజేశారు. అనంతరం మండల విద్యాధికారి మాట్లాడుతూ ఉన్నత స్థానంలో రాణించాలంటే సాంఘిక శాస్త్రం ఎంతో అవసరమన్నారు. సాంఘిక శాస్త్రం ఫోరం జిల్లా అధ్యక్షుడు బసవరాజ్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రహరీ ఏదీ?



ముళ్ల పొదలతో నిండిన ప్రహరీ స్థలం

- పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: మండలంలోని నాజుఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాల గ్రామానికి దూరంగా ఉంది. అదికూడా చెరువు ఒడ్డుకు ఉండడంతో సరిసృపాలు, ముఖ్యంగా పాములు సంచరించే అవకాశం లేకపోలేదు. ఈ విషయంలో జరగరానిది ఏదైన సంభవిస్తే ఎవరు బాధ్యులని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ముందు వైపు ప్రహరీ ఏర్పాటు చేయించి మిగత మూడు వైపులకు నిర్మించలేదు. ఈ క్రమంలో అప్పుడప్పుడు పాఠశాలలోకి పాములు వస్తుంటాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆ పాఠశాల పక్కనే ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రం కూడా కొనసాగుతుంది. చిన్నచిన్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి వస్తుంటారు. ఈ పాఠశాల చెరువు ఒడ్డున ఉండడంతో పాటు చుట్టు పక్కలా పంట పొలాలే ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో ఎక్కువగా విషసర్పాలు, చిన్నచిన్న జంతువులు సంచరించే అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో ఒకే ఒక ఉపాధ్యాయుడు ఉంటాడు. ఏదైన పాఠశాల పని విషయంలో మండల కేంద్రానికి వస్తే అక్కడ విద్యార్థులు మాత్రమే ఉండాలి. అలాంటి సమయంలో ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే కాపాడే వారుండరని చెబుతున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 15 మంది విద్యార్థులు ఉండగా, 21 మంది చిన్నారులు అగన్‌వాడీలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి వెంటనే ప్రహరీ నిర్మాణపనులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.